# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధి శరవేగంగా కొనసాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**
2. **వైద్య ఆరోగ్య రంగంలో వినూత్న ఆవిష్కరణల కోసం భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **త్వరలో 40 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వెల్లడించారు.**
4. **స్మార్ట్ రేషన్ కార్డు వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ ''మన్ కీ బాత్'' మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు రోజుల పర్యటనలో భాగంగా నిన్న సాయంత్రం గుజరాత్ చేరుకున్నారు. అహ్మదాబాద్‌లోని ఖోడల్ధామ్ మైదానంలో 5 వేల 400 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ... దేశవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధి శరవేగంగా కొనసాగుతోందన్నారు. ప్రస్తుత ప్రపంచం భారత ప్రతిభను గుర్తించి గౌరవిస్తోందని, ఫలితంగా వివిధ దేశాల్లో అనేక అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. భారతీయ సమాజం స్వయం సమృద్ధి సాధించాలని, స్వదేశీ ఉత్పత్తులను నమ్మకంతో స్వీకరించాలని పిలుపునిచ్చారు. స్వదేశీ ఉద్యమం శతాబ్దాల నాటి స్మారకం కాదని.. ఇది భవిష్యత్‌ను బలోపేతం చేస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ....

వాయిస్ 27 సెకన్లు

---------------------------

వైద్య ఆరోగ్య రంగంలో వినూత్న ఆవిష్కరణల కోసం భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అమరావతి సచివాలయంలో ఆసియా పసిఫిక్ బయోడిజైన్ అలయన్స్‌కు చెందిన వేర్వేరు దేశాల వైద్య నిపుణులతో నిన్న

సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరావతిలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లో అంతర్భాగంగా బ్రెయిన్ కార్యకలాపాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆస్ట్రేలియా, అమెరికా, ఇజ్రాయెల్, జపాన్, సింగపూర్, తైవాన్, ఐర్లాండ్ తదితర దేశాలకు చెందిన వైద్య నిపుణులు ఆయా దేశాల్లో బయోడిజైన్ కార్యకలాపాలను ముఖ్యమంత్రికి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈరోజు పర్యటిస్తారు. నౌకాదళంలోకి ఐఎన్ఎస్ ఉదయగిరి, హిమగిరి యుద్ధనౌకల ప్రారంభ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు.

---------------------------

పేదలపై భారం తగ్గించేందుకు, ప్రతి మండలంలో జనరిక్ ఔషధాలు లభ్యమయ్యేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో వైద్య సదుపాయాలు మెరుగు, ఆరోగ్య బీమాలో మార్పులు, కొత్త వైద్య కళాశాలల నిర్మాణం, ఉచిత వైద్య పరీక్షలు, యోగా- నేచురోపతి సేవల విస్తరణపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రి నిర్మించేలా కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

త్వరలో 40 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 90 కోట్ల రూపాయలతో నిర్మించిన భవనాలను ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సమగ్రాభివృద్ధికి సహకరిస్తామని రేవంత్ రెడ్డి పేర్కొంటూ...

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

రైతుల అవసరాలకు అనుగుణంగా కేంద్రం నుంచి యూరియా వస్తోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి కే.అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిశాలోని ధమ్రా పోర్టు నుంచి 10 వేల 8 వందల టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి పేర్కొన్నారు. సెప్టెంబరు 6వ తేదీన గంగవరం పోర్టుకు 15 వేల టన్నులు, సెప్టెంబరు రెండో వారంలో కాకినాడ పోర్టుకు 30 వేల టన్నుల యూరియా సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వ హామీ ఇచ్చినట్లు మంత్రి వివరించారు.

---------------------------

స్మార్ట్ రేషన్ కార్డు వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు ఆయన నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్తగా వచ్చిన కార్డులను వృద్ధులు, దివ్యాంగులకు సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చి అందజేస్తారని పేర్కొంటూ...

..వాయిస్..28 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 29వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అనే తన మాటను అమలులో చూపించిన... నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిస్సా జయంతి ఈరోజు. ప్రస్తుత మాసిడోనియాలో 1910 ఆగస్టు 26వ తేదీన ఆమె జన్మించారు. ఎక్కడో పుట్టి సేవ చేయాలనే సంకల్పంతో భారత్‌కు వచ్చిన ఆమె... కలకత్తాలో కుష్టు వ్యాధిగ్రస్తులకు సేవ చేశారు. సేవ అనే పేరు గుర్తుకురాగానే మదర్ థెరిస్సా పేరును గుర్తుచేసుకునే స్థాయిలో ఆమె ప్రజల మనస్సులో స్థానం సంపాదించారు. మానవసేవ కన్నా మిన్న లేదని చాటిన మదర్ థెరిస్సా...భారత్‌లో ఆపన్నులు, ఆర్తులు, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ముందువరుసలో నిలిచి.. ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన వనితగా గుర్తింపు పొందారు.

---------------------------

భారత వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి గుజరాత్‌లోని అహ్మదాబాద్ లో జరుగుతున్న కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలుచుకుంది. నిన్న జరిగిన వెయిట్ లిఫ్టంగ్ పోటీలలో ఆమె మహిళల 48 కేజీల విభాగంలో 193 కిలోలు ఎత్తి విజేతగా నిలిచింది.

---------------------------

ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 నుంచి 5.8 కి.మీ మధ్య కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం పేర్కొంది. దీని ప్రభావంతో రానున్న 48 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలియజేశారు. అల్పపీడన ప్రభావంతో ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి పేర్కొంటూ...

..వాయిస్... 30 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ అల్పపీడన ప్రభావంతో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================